www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 3 నవంబర్ 2025

5

చిత్తూరు



వైభవంగా కైశిక ద్వాదశి ఆస్థానం

మాడ వీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తి దర్శనం

ప్రజాశక్తి- తిరుమల: కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో ఆదివారం కైశిక ద్వాదశి ఆస్థానం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా వేకువ జామున 4.30 నుండి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. అనంతరం స్వామి, అమ్మవార్లను బంగారువాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ ఏడాదికోసారి కైశిక ద్వాదశి ఆస్థానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. భక్తులందరికీ స్వామివారి కృపా కటాక్షాలు కలగాలని ప్రార్థించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల చిన్నజీయర్‌స్వామి, డిప్యూటీ ఈఓ లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రైతుల పొలాల్లో జల కళ...

- సత్ఫలితాలు ఇస్తున్న ఉపాధి పనులు
- భారీగా పెరిగిన భూగర్భ జలాలు
- జిల్లాలో 25 వేల నీటి కుంటలు మంజూరు
- పూర్తి అయినవి 6 612 మాత్రమే..
- లక్ష్యానికి దూరంగా నీటి కుంటల తవ్వకం

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

కరువు జిల్లాపై వరుణుడు కరుణ చూపాడు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు ప్రతి రైతు పొలంలో ఉపాధి హామీ చట్టం కింద తవ్విన నీటి కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. చిత్తూరు జిల్లాలో 2,37,644 ఉపాధి జాబ్ కార్డులు ఉన్నాయి. రైతుల పంట పొలాల్లో సాగును అభివృద్ధి చేసుకునేందుకు ఫారం ఫండ్స్ నీటి కుంటలు తవ్వకానికి ఉపాధి హామీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చింది. ప్రతి రైతు వారి వ్యవసాయ పొలంలో నీటి కుంటలు తవ్వినట్లయితే భూగర్భ జలాలు పెరుగుతాయి. మరోపక్క కుంటలతో నిండిన నీటితో కూరగాయలు వంటి ప్రత్యేక పంటలు సాగు చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. తద్వారా రైతులు ఆర్థికంగా కొంతమేరకు ఉపశమనం కలుగుతుందని ఉద్దేశంతోనే జిల్లాలో ఉపాధి హామీ కింద ఈఆర్థిక సంవత్సరంలో 700 గ్రామపంచాయతీల్లో 25,831 ఫారం పండ్స్ నీటి కుంటల తవ్వకం చేపట్టారు. అందులో 7,939 ఫారం ఫండ్స్ పనులు జరుగుతున్నాయి. ఇందులో 6612 నీటి కుంటలు పూర్తి అయ్యాయి. చిత్తూరు జిల్లాలో చాలా వరకు రైతుల పొలాల్లో చేపట్టిన సంజీవిని నీటి కుంటల్లో నీరు సమృద్ధిగా నిండుకున్నాయి. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. నీటి కుంటల తవ్వకంపై క్షేత్రస్థాయిలో ఉన్న ఉపాధి సిబ్బంది రైతులకు అవగాహన కల్పించకపోవడం, మండల స్థాయి ప్రోగ్రాం అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఉపాధి పనులు నత్తనడకన సాగుతున్నాయి.

పెరిగిన భూగర్భ జలాలు

ఉపాధి హామీ చట్టం కింద చేపట్టిన చెరువుల పూడికతీత పనులు, జంగిల్ క్లియరెన్స్, సప్లై ఛానల్ మరమ్మతు పనులు చేపట్టారు. మంజూరైన పనుల్లో సగభాగం మాత్రమే పూర్తికాగా మిగతా వాటిని త్వరలో పూర్తి చేయనున్నారు. చెక్ డ్యాములు, పంట కాలువల పూడికతీత పనులతో ప్రస్తుత వర్షాలకు జలకలను సంతరించుకున్నాయి. ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. నెలరోజుల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా సుమారు 30అడుగులకు పైగా భూగర్భ జలాలు వృద్ధి చెందాయంటే పరిస్థితి అర్థం అవుతుంది. సాధారణంగా మూడు అడుగుల భూగర్భ జలాలు పెరిగితే సుమారు 8 టిఎంసిల నీరు భూమిలోకి చేరుతుంది. ఉపాధి హామీ ద్వారా నిర్మించిన సేద్యపు సంజీవిని నీటి కుంటలు సైతం చాలా చోట్ల పూర్తిగా నిండాయి. ఈ పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు సుమారు 25 వేల కుంటల పనులను ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రింగ్ ట్రెంచ్ వర్క్స్ మామిడి రైతులకు ఎంతో ఉపయోగం

మామిడి తోపు ఉన్న రైతులకు రింగ్టన్స్ వర్క్స్ (మామిడి చెట్ల చుట్టూ కందకాలు) ఈ పనులు ఉపాధి హామీ ద్వారా వ్యవసాయ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఒక్కో చెట్టుకు వారి పథకం కింద క్యూబిక్ మీటరుకు రూ.307లు చెల్లిస్తారు. ఈ కందకాల్లో ఎరువులు వేయడంతో చెట్లు పోషక విలువలతో కూడి చెట్లు ఎదుగుదలకు ఉపయోగకరంగా ఈపనులు ఉంటున్నాయని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఈ కందకాల్లో నీరు నిల్వ ఉంటున్నాయి.

ప్రతి రైతుకు అవగాహన కల్పిస్తాం..
- రవికుమార్, డ్వామా పీడీ

చిత్తూరు జిల్లాలో 25 వేల నీటి కుంటలు (ఫారం పాండ్) మంజూరు చేశాం. ప్రస్తుతం 50శాతం పనులు పూర్తి కావస్తున్నాయి. ఈ ఐదు నెలల కాలంలో 100 శాతం పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటాం. నీటి కుంటలు ప్రతి రైతుకి ఎంతో ఉపయోగం, వీటిపై రైతులకు అవగాహన కల్పించి వారి పొలంలో సంజీవిని నీటి కుంటలను తవ్వకునేలా క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించాం.





మామిడి చెట్ల చుట్టూ నిండిన వర్షపు నీరు, పూర్తిగా నిండిన రైతుల పొలాల్లోని నీటి కుంటలు

శ్రీహరికోట సిగలో మరో కీర్తి కిరీటం

- ఎల్‌విఎం 3 ప్రయోగం సక్సెస్
- నింగిలోకి దూసుకెళ్లిన బాహుబలి రాకెట్

ప్రజాశక్తి- సూళ్లూరుపేట

ఇస్రో చేపట్టిన ఎల్‌విఎం3- మిషన్ 5 'బాహుబలి' రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. ఈ ప్రయోగంతో ఇస్రో మరో మైలురాయిని అధిగమించింది, ఇది ఎల్‌విఎం 3 సిరీస్‌లో ఐదవ విజయవంతమైన ప్రయోగం. ఈ ప్రయోగం ద్వారా కమ్యూనికేషన్ శాటిలైట్ సిఎంఎస్ 03 కక్ష్యలోకి విజయవంతంగా చేరింది. ఈ ప్రయోగం ద్వారా సిఎంఎస్ 03 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని 16.09 నిమిషాల్లో కక్ష్యలోకి ప్రవేశపెట్టారు.

శ్రీహరికోట సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు ఎల్‌విఎం 3- ఎం5 రాకెట్ నిప్పులు చెరుగుతూ నింగిలోకి దూసుకెళ్లింది. 4,410 కిలోల బరువున్న ఉపగ్రహాన్ని భూస్థిర కక్షలో నిలపడం ద్వారా దేశంలో కమ్యూనికేషన్, నావిగేషన్, రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే విధంగా రూపకల్పన చేశారు. 'భారత అంతరిక్ష ప్రయోగంలో ఇది ఒక మైలురాయి'అని ఈ ప్రయోగాన్ని పర్యవేక్షించిన ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ వ్యాఖ్యానించారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రయోగం వల్ల దేశీయ సాంకేతికతతో పాటు కమ్యూనికేషన్ సేవలు మరింత మెరుగుపడతాయని, జాతీయ భద్రతలో కీలకంగా అంతరిక్షం నుంచి నిఘా మరింత పటిష్టం చేయడంలో ఈ శాటిలైట్ కీలకంగా మారనుందని ఆయన చెప్పారు. ముఖ్యంగా చైనా, పాకిస్తాన్ నౌకల కదలికలపై నిఘా ఉంటుందని, దేశరక్షణ వ్యవస్థలో కీలకమైన జలాంతర్గాములు, నౌకలకు సాంకేతిక సహకారం అందిస్తుందని తెలిపారు. ఆ దిశగా ఎల్‌విఎం 3 రాకెట్ పదేళ్లపాటు సేవలు అందించే దిశగా రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. జీశాట్ -7 స్థానంలో ఎల్‌విఎం 3- రాకెట్ విజయవంతంగా ప్రయోగించామని, ఇది అద్భుత విజయంమని అన్నారు.

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) జిఎస్ఎల్వి సిరీస్‌లో ఇప్పటికీ 19 ప్రయోగాలు చేయగా 15ప్రయోగాలను మన శాస్త్రవేత్తలు విజయవంతం చేశారు. 4 ప్రయోగాలు మాత్రమే విఫలమయ్యాయి. దీన్ని దష్టిలో ఉంచుకుని జిఎస్ఎల్వి మార్క్‌బి3 (ఎల్‌విఎం 3) రాకెట్ వంటి భారీ రాకెట్లను రూపొందించడంలో కూడా ఎంతో పరిణితిని సాధించారు. జిఎస్ఎల్వి మార్క్-3 రాకెట్‌ను మొదటిగా 2014 డిసెంబర్ 25న ప్రయోగాత్మకంగా ప్రయోగించి విజయం సాధించారు. ఆ తర్వాత 2017 జూన్ 5లో జిఎస్-ఎల్వి మార్క్ 3-డి1 ద్వారా జిశాట్-19 అనే ఉపగ్రహాన్ని, 2018 నవంబర్ 14న జిఎస్ఎల్వి మార్క్-బిడీ 2 ద్వారా జిశాట్ 29 ప్రయోగాలు చేసి విజయాలు సాధించారు. 2019 జూలై 22న చంద్రయాన్-2 ప్రయోగాన్ని నిర్వహించే సమయంలో జీఎస్ఎల్వీ మార్క్3 పేరు ఉన్న ఈ రాకెట్‌ను ఎల్విఎం3 ఎం1గా పేరు మార్పు చేశారు. అప్పటినుంచి జిఎస్ఎల్వి మార్క్3గా పేరున్న ఈ రాకెట్‌ను ఎల్‌విఎం3 అనే పేరును వాడుకలోకి తెచ్చారు. 2022 అక్టోబర్ 23న ఎల్విఎం3-ఎం2, 2023 మార్చి 26న ఎల్విఎం 3-ఎం3 ప్రయోగాల్లో వన్‌వెబ్ ఇండియా పేరుతో రెండు వాణిజ్యపరమైన ఉపగ్రహాల నిర్వహించి విజయాలను అందుకున్నారు. ఆ తర్వాత ఇస్రోకు, భారతదేశానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్-3 ప్రయోగాన్ని 2023 జూలై 14న ఎల్విఎం3- ఎం4 రాకెట్ ద్వారా ప్రయోగించి ఇస్రో చరిత్రలో ఒక మైలురాయి వంటి ప్రయోగాన్ని విజయవంతం చేసి ప్రపంచాన్నే అబ్బుర పరిచారు. అంటే ఎల్విఎం3 రాకెట్ సిరీస్‌లో ఇప్పటిదాకా 7 ప్రయోగాలను విజయవంతంగా నిర్వహించగా ఆదివారం 8వ ప్రయోగం కూడా విజయవంతగా నిర్వహించారు.



నిప్పులు కక్కుతూ దూసుకెళ్తుతున్న ఎల్‌విఎం3 రాకెట్



మీడియా సమావేశంలో రాకెట్ నమూనాలు చూపుతున్న ఇస్రో చైర్మన్ నారాయణన్

నేడు కలెక్టరేట్‌లో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఈనెల 3వ తేదీన సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో 3వ తేదీ సోమవారం ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజనల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో కూడా వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చునని, అలాగే నమోదైన అర్జీల గురించి వాటి స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్ సెల్

చిత్తూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్' (ప్రజల ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం) 3వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు పాత డిపీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పోలీస్ అధికారులకు నేరుగా తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 3వ తేదీ సోమవారం ఉదయం 10.30గంటలకు నగర పాలక సంస్థలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కర వేదికను సద్వినియోగం చేసుకోవాలని నగర కమిషనర్ నరసింహప్రసాద్ కోరారు.

కుప్పంలో నేడు పిజిఆర్ఎస్

కుప్పం: కుప్పం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం 3వ తేదీని పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కడ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నట్లు పీడీ తెలిపారు. కుప్పం నియోజకవర్గ ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో తెలియజేస్తే వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

పండుగ సంత ధరల మంట

- వారపు సంతలో కనీస సౌకర్యాలు కరువు
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
- రాకపోకలకు ఇబ్బందులు



వర్షం వస్తే తడవకుండా ప్లాస్టిక్ పట్టలు కట్టుకొని వ్యాపారాలు చేస్తున్న వ్యాపారస్తులు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారపు సంతలో కనీస సౌకర్యాలు కరువై వ్యాపారస్తులు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వారపు సంతలో కూరగాయల కొనుగోలు కోసం వచ్చే వారు సోమల-కలికిరి ప్రధాన రహదారిపైనే వాహనాలు పార్కింగ్ చేస్తూ ఉండడంతో భారీ వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారుతోంది.

ప్రతి ఆదివారం కందూరులో వారపు సంత నిర్వహిస్తూ ఉండగా సంతకు వల్లిగట్ల, కామిరెడ్డివారిపల్లి, నెల్లిమంద, బాలేవారిపల్లి, తమ్మినాయునిపల్లి పంచాయతీల నుంచి దాదాపు 50 గ్రామాలకు పైగా ప్రజలు సంతకు వచ్చి నిత్యావసర వస్తువులు, కూరగాయలు తీసుకొని వెళ్తూ ఉంటారు. వారపు సంత నిర్వహించే ప్రదేశం అపరిశుభ్రతకు నిలయమై దుర్గంధం భరితమై వినియోగదారులకు వ్యాపారస్తులకు కూడా ఇబ్బందిగా మారుతోంది. చింత చెట్ల కింద వారపు సంత నిర్వహిస్తూ ఉండడంతో వర్షం వస్తే చాటు లేక తడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

వారపు సంత నిర్వహణ కోసం ప్రతి ఏడాది వేలం పాటలు నిర్వహిస్తూ వస్తున్నారు. లక్షల్లో ఆదాయం ఉన్న కనీస సౌకర్యాలు లేవు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు, షెల్టర్లు లేకపోవడంతో తాము అసౌకర్యాల నడుమే వ్యాపారాలు చేస్తున్నామని వ్యాపారస్తులు అంటున్నారు. సంత నిర్వహణ స్థలం ఇరుకుగా ఉండడంతో సోమల -కలికిరి ప్రధాన రహదారిపై కూడా వ్యాపారస్తులు వాహనాలు పెట్టుకుని వ్యాపారాలు చేస్తూ ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. పంచాయతీ వారు వారపు సంతలో సమస్యలను గుర్తించి వ్యాపారస్తుల కోసం షెల్టర్ల నిర్మాణం, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని వినియోగదారులు వ్యాపారస్తులు కోరుతున్నారు.

పండుగ సంత ధరల మంట

కార్తీక మాసం నోముల పండుగ నిర్వహణ కారణంగా భక్తులు వారపు సంతలో పూజా సామగ్రి, నిత్యావసర వస్తువులు, కూరగాయలు కొనుగోలు చేసేందుకు అధిక సంఖ్యలో ఆదివారం హాజరయ్యారు. కూరగాయల ధరలు అధికంగా ఉండడంతో వినియోగదారులు కొనలేక ఇబ్బందులు పడుతూ పండుగ కోసం అయినా కొనాల్సిన పరిస్థితి ఏర్పడడంతో నిత్యావసర వస్తువులు కొనుగోలు చేశారు.



రోడ్డుకు ఇరువైపులా వాహనాల పార్కింగ్‌తో ట్రాఫిక్ సమస్యలు

పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి: ఎమ్మెల్సీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

ప్రజాశక్తి- రామకుప్పం: సీఎం చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అహర్నిశల కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. మండలంలోని ఆనిగానూరు, బల్ల, విజలాపురం, ఉన్సిగానిపల్లి గ్రామపంచాయతీలో ఆదివారం సమన్వయ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేన్సర్ భారి నుంచి ప్రజలను కాపాడేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి కార్యకర్త ముందుండి ప్రజలకు మేలు చేయాలన్నారు. కుప్పం అభివృద్ధికి సీఎం కుటుంబం వివిధ రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నారన్నారు. టిడిపి రాష్ట్రనేతలు మునస్వామి, నారాయణ చారి, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయరెడ్డి, నరసింహులు, రామ్మూర్తి, సీతాపతి, చలపతి పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బాల్య వివాహాలు చట్టరీత్యానేరమని, బాల్య వివాహాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రియల్ సంస్థ ప్రతినిధి రామారావు తెలిపారు. నగర శివారు ప్రాంతంలో ఆదివారం రియల్ సంస్థ సీఈవో రామారావు ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలకు పాల్పడితే సమీప పోలీస్ స్టేషన్, పోలీస్ హెల్ప్ లైన్ 112, చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్య వివాహాల నివారణ చట్టం పిసిఎంఏ 2006 మేరకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.లక్షల ఫైన్ విధించడం జరుగుతుందని తెలిపారు

రైతు సమస్యల పరిష్కారమే రెస్కో లక్ష్యం..

ప్రజాశక్తి- రామకుప్పం: కుప్పం నియోజకవర్గ రైతులకు మెరుగైన విద్యుత్ సేవలందించడమే రెస్కో లక్ష్యమని టిడిపి రాష్ట్రనేత మునస్వామి, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్ పేర్కొన్నారు. మండలంలోని ఆనిగానూరు గ్రామంలో ఆదివారం నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. నియోజకవర్గ స్థాయిలో పంట పొలాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులకు ఎప్పటికప్పుడు విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ముందుంటుందన్నారు. లో వోల్టేజ్ సమస్యలు లేకుండా గత టిడిపి ప్రభుత్వంలో ప్రతి రైతుకి పొలాల వద్ద ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, రామ్మూర్తి ,శ్రీనివాసులు రెడ్డి, గుర్రప్ప పాల్గొన్నారు.

సాంకేతిక సమస్యలకు

టీచర్లను బాధ్యులు చేయడం తగదు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర విద్యాశాఖలో ముఖ హాజరు నమోదులో ఏర్పడే సాంకేతిక కారణాలకు టీచర్లకు సంజాయిషీలు ఇవ్వడం సరికాదని వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ వీ.రెడ్డిశేఖర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉపాధ్యాయులు ఉదయం 9.30 గంటల లోపు ఒక హాజరు వేయాల్సి ఉంటుందని, అయితే ఇంటర్నెట్ సిగ్నల్స్ సరిగా లేకపోవడం, సర్వర్ బిజీగా ఉండడం వలన కొంతమంది ఉపాధ్యాయులు లీప్ యాప్‌లో హాజరు వేయడానికి ఆలస్యం అవుతున్నదని తెలిపారు. టెక్నికల్ సమస్యలు ఏర్పడినప్పుడు ఉపాధ్యాయులను చైతన్య పరచి సమయానికి హాజరు గుర్తింపు అయ్యేలా చూడాలని కోరారు. సమయపాలనలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో తప్పు లేదని, ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు ధోరణితో ఉపాధ్యాయులకు ఇచ్చిన సంజాయిషీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పక్షవాతంపై అవగాహన వాకథాన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా పక్షవాతం గురించి అవగాహన కల్పించేందుకు వేలూరు నరువీ హాస్పిటల్ తరపున వాకథాన్ 2025 కార్యక్రమాన్ని హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ జివి.సంపత్ అధ్యక్షతన, వేలూరు నగర మేయర్ సుజాత ఆనందకుమార్ సమక్షంలో వేలూరు ఎమ్మెల్యే పి.కార్తికేయన్ జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో 500 మందికి పైగా పక్షవాతం గురించి అవగాహన కల్పించే బ్యానర్లు పట్టుకుని వాకథాన్‌లో పాల్గొన్నారు. వేలూరు కోట మైదానం నుండి ప్రారంభమైన వాకథాన్‌లో నరువీ హాస్పిటల్ వైస్‌చైర్మన్ అనితా సంపత్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శరవణన్ రామన్, జనరల్ మేనేజర్ నితిన్ సంపత్, న్యూరాలజీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ చిత్తంబలం పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో జిల్లా ఎస్పీ

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదివారం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఏఈఓ రవీంద్రబాబు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, కాణిపాకం ట్రైన్ ఎస్సై తేజస్విని ఉన్నారు.



ఆగని గజదాడులు

- నష్టపోతున్న రైతన్నలు
- పట్టించుకోని అధికారులు
- నష్టపరిహారంతో సరి..
- నివారణకు చర్యలు శూన్యం

ప్రజాశక్తి - రొంపిచర్ల

పులిచెర్ల మండలంలో నిత్యం ఏదో ఒక గ్రామంలో ఏనుగుల గుంపు పంటపై దాడి చేసి తిని తొక్కి రైతులకు నష్టాన్ని మిగుల్చుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున రిజర్వు ఫారెస్ట్ నుంచి బయలుదేరిన 16 ఏనుగుల మంద పాల్యం పంచాయతీ కోటపల్లి కు సమీపంలోని పంట పొలాలపై విరుచుకుపడ్డాయి. పాల్యం గ్రామానికి చెందిన నరసింహులు అనే రైతుకు చెందిన 60 మామిడి చెట్లను విరిసి ధ్వంసం చేశాయి. అలాగే రైతులు వెంకట్రామయ్య, మురళి, రఘులకు చెందిన మామిడి చెట్లను సైతం విరిచేశాయి. పక్కనే ఉన్న పశుగ్రాసం, టమోటా, వరి పంటలను తొక్కుకుంటూ వచ్చిన మార్గం గుండాన్ని అడవుల్లోకి వెళ్లిపోయాయి. గత కొన్ని నెలలుగా ఈ ఏనుగుల గుంపు అటవీ ప్రాంత సరిహద్దులోని వ్యవసాయ పంటలపై దాడులు చేస్తూనే ఉన్నాయి. నష్టపోయిన రైతులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. ఇన్ని రోజులుగా ఏనుగులు గ్రామాల్లో సంచరిస్తూ, రైతులు కష్టపడి పండించిన పంటలను నష్టపరిస్తుంటే చర్యలు తీసుకోవల్సిన అటవీ శాఖ అధికారులు బాధితులను పరామర్శించి పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చేస్తామని హామీలు ఇస్తున్నారు. ఏనుగుల భారి నుంచి తమను, పంటలను కాపాడాలని రైతులు గగ్గోలు పెడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధుల చెవుల్లో పడటం లేదు. ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఇకనైనా ఆ దిశగా ప్రజాప్రతినిధులు, అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఏనుగులు విరిచిన మామిడి చెట్లు

రోడ్డుపై వర్షపు నీరు

- తొలగించాలంటున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల నుండి కందూరు వెళ్లే మార్గమధ్యంలోని నెల్లిమంద పంచాయతీ బురుజుపల్లి గ్రామం వద్ద సోమల- కందూరు ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు సమీప ప్రాంత నివాస ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసి రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించినప్పుడు నీరు సజావుగా వెళ్లేందుకు సరియైన మార్గం లేకపోవడంతో రోడ్డుపైనే నీరు నిలిచిపోతున్నాయి. దీంతో వాహనాలు వెళ్లేటప్పుడు రోడ్డుకు ఇరువైపులా ఉన్న నివాస గృహాల వారి ఇండ్లపై వర్షపు నిల్వ ఉన్న నీరు ఎగిరి పడుతూ ఉండడంతో వారు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోజుల తరబడి వర్షపు నీరు రోడ్డుపై నిల్వ ఉన్న కారణంగా రోడ్డు నాణ్యత దెబ్బతిని గుంతలు పడే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. పంచాయతీ వారు కానీ ఆర్ అండ్ బి వారు గాని సమస్యను పరిశీలించి రోడ్డుపైనున్న వర్షపు నీరు తొలగించి వర్షపు నీరు సజావుగా వెళ్లే మార్గాన్ని ఏర్పాటు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపు నీరు

నిరాశ్రయులకు.. ఆశ్రయం..

- వసతి గృహనిర్వహణ భేష్..



నిరాశ్రయులకు దుస్తులు అందజేస్తున్న మెప్మా అధికారులు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: ఇతర ప్రాంతాల నుండీ వచ్చి చిత్తూరు నగరంలో నిరాధరణకు గురై ఆశ్రయం లేక ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు మెప్మా ఆధ్వర్యంలో నడపబడుతున్న నిరాశ్రయుల వసతి భవనం ఆశ్రయం అందిస్తూ ఆదుకుంటోంది. చిత్తూరు నగరంలోని కట్టమంచి, గంగనపల్లి సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరాశ్రయుల వసతి భవనాలు నగరంలోని నిరాశ్రయులను ఆశ్రయం కల్పిస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ నిరాశ్రయ వసతి భవనంగా చిత్తూరు నిరాశ్రయ వసతి భవనం గుర్తింపబడింది. ఈ మేరకు వసతి భవన నిర్వాహకులు జోసఫ్ రాజు ప్రసంశలు అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలోనే కాకుండా చిత్తూరు నగరంలోనూ పలువురు వసతి గృహనిర్వహణపై ప్రసంశిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా జోసఫ్ రాజు ఆశ్రయం లేని నిరాశ్రయుల పట్ల ఎంతో ప్రేమతో ఆశ్రయం కల్పిస్తూ నిత్య పర్యవేక్షణలో ఎలాంటి ఇబ్బందుల లేకుండా మెప్మా ఆదేశాల మేరకు భోజనం అందించడంతో పాటు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. దాతల సాయంతో దుప్పట్లు, దుస్తులను అందిస్తున్నారు. ఇటీవల దీపావళి పండగను నిరాశ్రయుల భవనంలో నిర్వహించారు. పేదల పట్ల ప్రేమ నిరాశ్రయులంటే ఆధారణ కలిగిన వ్యక్తి సఫోర్టు సంస్థ నిర్వాహకులు జోసఫ్ రాజు నిరాశ్రయుల వసతి భవనాలను అత్యంత సుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నిత్య పర్యవేక్షణ చేస్తున్నారు. ఇటీవల మెప్మా ఉన్నతాధికారి సందర్శించి జోసఫ్ రాజు అందిస్తున్న సేవలను ప్రసంశించారు.

అభద్రత!

- ప్రమాదాల హైవే
- విస్తరణ పనుల్లో భద్రతా లోపం
- 'పుత్తూరు -తిరుత్తణి' రహదారిపై
ప్రయాణికుల, వాహన చోదకుల భయాందోళన

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : పుత్తూరు నుండి తిరుత్తణి వరకు నిర్వహిస్తున్న రహదారి విస్తరణ పనులు ప్రయాణికులకు ప్రమాదకరం గా మారి అభద్రత నెలకొంది. పనుల నిర్వహణ విధానంలో లోపాల కారణంగా సాధారణ ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి నిర్మాణ పనులు ఒకవైపు కొనసాగుతున్నా వాహన రాకపోకలు యథాతథంగా సాగుతున్నాయి. ఈ రహదారి చాలా ఇరుకుగా మారింది. దీంతో అమిత వేగంతో వెళ్లే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాల నిరోధానికి రహదారి విస్తరణ పనులు చేపట్టిన వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఈ కారణంగా ఈ రహదారిపై తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులకు, వాహన చోదకులకు ఈ రహదారిపై వెళ్లాలంటే గుండెల్ని గుప్పెట్లో దాచుకుని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది..

అభద్రత!

పుత్తూరు -తిరుత్తణి 4వే హైవే రహదారి విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. అటు ఇటు రోడ్డును వెడల్పు చేస్తున్నారు. ప్రస్తుతం మధ్యలో వున్న డబుల్ రోడ్డుపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. రోడ్డు విస్తరణకు ఉపయోగిస్తున్న వాహనాలు, పరికరాలు, మట్టిని పోసేందుకు మధ్యలో వున్న రహదారిని ఆశ్రయిస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలు ప్రమాదకరంగా మారాయి.



ప్రమాదాలకు గురైన వాహనాలు (ఫైల్ ఫోటోలు)

వేగంగా వెళుతున్న వాహనాల వేగ నియంత్రణకు, ప్రమాదకర సూచిక బోర్డులు, బారికేడ్లు వంటి ఏర్పాటుకు ఎలాంటి చర్యలు చేపట్ట లేదు. ఈ కారణంగా ఈ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది.

ప్రమాదాల హైవే

పుత్తూరు- తిరుత్తణి రహదారిలోని నగరి సాయిబాబా ఆలయం సమీపంలో రహదారి అంచులలో ఉంచిన ఇసుక బస్తాలు తరచూ జారిపోవడం అందులోనుంచి ఇసుక రోడ్డుపై పడటం వాహనదారులు దాన్ని గుర్తించక జారి పడటం నిత్యం పరిపాటిగా మారింది. 'టేక్ డైవర్షన్' బోర్డులు ఆకస్మికంగా ఉంచడం వల్ల డ్రైవర్లు గమనించక పోవడం, హఠాత్తుగా మలుపు తీసుకోవడం వంటి కారణాలతో ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయి. రాత్రి సమయంలో లైట్లు, రిఫ్లెక్టివ్ సైన్‌లు లేకపోవడం, రోడ్డు పక్కనే ఉన్న పల్లపు ప్రాంతాలు కనిపించకపోవడం వల్ల పరిస్థితి మరింత ప్రమాద కరంగా మారింది. దీనిపై ప్రజా సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

విస్తరణ పనుల్లో భద్రతా లోపం

రహదారి భద్రతా నియమాల చట్టం 2004 మేరకు జాగ్రత్తలు తీసుకోకుంటే నిర్లక్ష్యంగా పరిగణిస్తారని న్యాయ వాదులు హెచ్చరిస్తున్నారు.
- ఈ మార్గంలో తగిన దూరాల్లో అదనపు 'టేక్ డైవర్షన్' బోర్డులు ఏర్పాటు చేయాలి.
- అవసరమైన రహదారి సూచన చిహ్నాలు, లైన్ మార్కింగ్స్, రెఫ్లెక్టింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలి.
- అన్ని సూచిక బోర్డులు రాత్రి వేళల్లో కనిపించే రేడియంతో అమర్చాలి.
- పనులు పూర్తయ్యే వరకు తాత్కాలిక బారికేడ్లు, హెచ్చరిక కోన్లు ఏర్పాటు చేయాలి.

ఇవేవీ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయి.

ఆగని ప్రమాదాలు

ఈ రహదారిపై ప్రమాదాలు ఆగడంలేదు. నగరిలో క్రీడల్లో పాల్గొనేందుకు శనివారం కార్వేటినగరం నుంచి వస్తున్న క్రీడాకారులు, పీటీ మాస్టర్ ప్రయాణిస్తున్న కారును రామాపురం వద్ద ఓ బస్సు శనివారం ఢీకొంది. కారు ముందు భాగం దెబ్బతింది. అదృష్టవశాత్తు కారులో ఎర్‌బ్యాగ్ ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలతో వారు బయట పడ్డారు. ఇటీవల ఇరుకు రోడ్డులో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీని అకస్మాత్తుగా గమనించిన కారు డ్రైవరు ఒక్కసారిగా కారును ఆపడంతో వెనువైపు వేగంగా వస్తున్న తమిళనాడు బస్సు కారును వెనుకవైపు ఢీకొంది దీంతో కారు దెబ్బతింది. భద్రతా చర్యలు చేపట్టక పోవడమే ఈ ప్రమాదానికి కారణమైందని స్థానికులు తెలుపుతున్నారు. ఇటీవల మండలంలోని తడుకుపేట వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మించే ప్రాంతంలో వేకువ జామున వస్తున్న కారు అదుపు తప్పి పక్కనే ఉన్న పల్లపు ప్రాంతంలో పడిపోయింది. అదృష్టవశాత్తు ఎవరికీ ముప్పు ఎదురు కాలేదు. ఇలా పలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తగిన జాగ్రత్తలు చేపట్టి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

భద్రతా నియమాల లోపం



ప్రస్తుతం పుత్తూరు -తిరుత్తణి జాతీయ రహదారి పనుల్లో జాతీయ రహదారి భద్రతా నియమాలు పాటించడం లేదు. రహదారి భద్రతా నియమాల చట్టం 2004 మేరకు ప్రజల భద్రత విషయంలో ఇది నిర్లక్ష్యంగా పరిగణిస్తారు. నగరి సాయిబాబా ఆలయం సమీపంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇసుక బస్తాలు తరచూ జారిపోవడం, వాహనదారులు దానిని గుర్తించక జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో రిఫ్లెక్టివ్ సైన్‌లు ఉండటం లేదు. ప్రాణాలు పోయాక మేల్కోవడం కంటే ముందస్తు భద్రత తీసుకోవడం ఉత్తమం. వీటిపై నేషనల్ హైవే ప్రధాన అధికారికి లేక రాశాం..

- ఎ దీపక్, న్యాయవాది, యూత్ లయన్స్ అసోసియేషన్ అధ్యక్షులు.



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

వైసిపి కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి-కుప్పం: కుప్పం మున్సిపాల్టీ పరిధిలోని నాలుగు వార్డుల్లో వైసిపి కమిటీలను ఆదివారం ఏర్పాటు చేశారు. త్వరలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికలకు పార్టీ క్యాడర్‌ను సన్నద్ధం చేయడంతో పాటు గ్రామీణ స్థాయిలో పార్టీ క్యాడర్‌ను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా వైసిపి కమిటీలను ఏర్పాటు చేస్తోంది. ఆదివారం కుప్పం మున్సిపాల్టీకి సంబంధించి ఒకటో వార్డు అధ్యక్షుడిగా మునెప్ప, రెండవవార్డు అధ్యక్షుడిగా సంపత్, మూడో వార్డు అధ్యక్షుడిగా ప్రభాకర్, ఎనిమిదవ వార్డు అధ్యక్షుడిగా మూర్తిని ఎన్నుకున్నారు. పార్టీ బలోపేతం తో పాటు ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు నూతన కమిటీలు స్పందిస్తూ ప్రజల పక్షాన పోరాడుతుందని మున్సిపల్ పార్టీ అధ్యక్షులు హఫీజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మునిరాజు, మణి, మోహన్ రామ్, నాగరాజు, రాజ్ కుమార్,నాయకులు నరేష్ పాల్గొన్నారు.

జెడ్‌పీ ఉన్నత పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - రొంపిచర్ల : రొంపిచర్ల మండలంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి చల్ల రామచంద్రారెడ్డి ఆదివారం పరిశీలించారు. పాఠశాలలో వేదికను నిర్మించాలని అధికారు లను ఆదేశించారు. వాటర్ ట్యాంక్ లీకేజీలను పరిశీలించి అక్కడికి విచ్చేసిన అధికారులకు పనులు గురించి వివరించి త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీ లో నిర్వహించనున్న మహిళల క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్లో ఇండియా జట్టు గెలవాలని ఆకాంక్షిం చారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి కార్యక్రమం వీక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, సర్పంచ్ ఆర్ ఇబ్రహీం ఖాన్, గ్రామ కమిటీ అధ్యక్షులు జి ఇమ్రాన్ ఖాన్, ఎంఈఓ డి శ్రీనివాసులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి




బెంగుళూరు బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

బెంగుళూరుకు బస్సులు కరువు
ప్రయాణీకుల నిరీక్షణ

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు నుండి బెంగళూరుకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి బస్సులు లేక రోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు. నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కావడంతో వారాంతపు సెలవుల కోసం ఇండ్లకు వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తిరిగి బెంగళూరులో ఉద్యోగాలకు వెళ్లాల్సి ఉండడంతో బస్సులు లేక పోవడంతో, నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం ఎక్కువగా తిరుపతి, చిత్తూరు నుండి వచ్చే బస్సుల్లో ప్రయాణికులు అక్కడే నిండు కోవడంతో ఆ బస్సులు పలమనేరు మీదుగా రాకపోవడంతో , బైపాస్ లలో వెళ్లిపోవడంతో, ఒకటో రెండో వచ్చిన సీట్లు లేక బస్సులు నిండిపోవడంతో బెంగళూరు వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. ఆర్‌టిసి అధికారులు తగు చర్యలు తీసుకుని వారాంతపు సెలవుల్లో వచ్చి తిరిగి బెంగళూరుకు వెళ్లే ఉద్యోగుల కోసం ఇంకా అదనంగా బస్సులు వేయాలని పలువురు అభ్యర్థిస్తున్నారు.

పారిశుధ్య చర్యలు ముమ్మరం



ప్రజాశక్తి- తవణం పల్లి: ఇటీవలి వర్షాల కారణంగా గ్రామంలో నీటి నిల్వలు ఏర్పడటంతో డెంగీ, వైరల్ ఫీవర్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో, ఎమ్మెల్యే మురళి మోహన్ సూచన మేర కు ఆ పార్టీ మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి ప్రోద్బలంతో, గ్రామ సర్పంచ్ సబితా ప్రవీణ్ ఆధ్వర్యంలో ఎ గొల్లపల్లి గ్రామంలో శుభ్రత కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గ్రామ పరిసరాల్లోని డ్రైనేజీలు, నిలిచిన నీటి ప్రాంతాలను శుభ్రపరచడం, దోమల నివారణ కోసం మందుల పిచికారీ చేయడం, గ్రామస్తులకు ఆరోగ్యకరమైన వాతావరణం కోసం అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపట్టారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ ఎ గొల్లపల్లి ప్రవీణ్ మాట్లాడుతూ "ప్రతి ఇంటి వద్ద శుభ్రత పాటించడం ద్వారా మాత్రమే మన ఆరోగ్యాన్ని కాపాడుకోగలం" అని గ్రామ ప్రజలకు సూచించారు. గ్రామంలోని యువకులు, మహిళా సంఘ సభ్యులు, సిబ్బంది చురుకుగా పాల్గొని శుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు మృతి



రమాదేవి (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: అనారోగ్యంతో ఉపాధ్యాయురాలు రమాదేవి మృతి చెందారు. కొదలమడుగు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆమె మృతికి యుటిఎఫ్ సభ్యులు సరిత, మోహన్ రెడ్డి , ధనంజయరాజు, రవీంద్ర ప్రసాద్ సంతాపం తెలిపారు.



సర్కాజీ సయ్యద్ ఫక్రుద్దీన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

బైరెడ్డిపల్లి సర్కాజీగా సయ్యద్ ఫక్రుద్దీన్

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలం కడపనత్తం గ్రామానికి చెందిన సయ్యద్ ఫక్రుద్దీన్‌ను బైరెడ్డిపల్లి మండల సర్కాజిగా నియమిస్తూ విజయవాడ మైనారిటీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ నుండి ఉత్తర్వులు అందాయని ఆయన సోమవారం తెలిపారు. ముస్లిం సోదరుల సమస్యలు ఏవైనా ఉంటే వాటిని తమకు తాము పరిష్కరించుకునేలా ప్రభుత్వం నియమించే ఈ సర్కాజీ కొలువు ఎంతో గౌరవప్రదమైందని, ఈ పదవికి తను శాయశక్తుల నిబద్ధత, క్రమశిక్షణతో నిర్వహిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ముస్లిం పెద్దలతో మండల టిడిపి అధ్యక్షులు కిషోర్ గౌడ్ నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా పూలమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా కిషోర్ గౌడ్ మాట్లాడుతూ తమ మండలంలో ముస్లిం మైనార్టీ సోదరులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారని తమకు వచ్చిన సమస్యలను వారే మసీదులలో పరిష్కరించు కుంటున్నారని అవసరమైతే తప్ప గ్రామ పెద్దలను కలుస్తారని, ఈ మండలానికి సర్కాజీ సయ్యద్ ఫక్రుద్దీన్ రావడం మండలానికి గర్వకారణం అని, ఈ పదవి ఇతనికి రావడం తనకెంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర మైనారిటీ వెల్ఫేర్, వక్ఫ్ బోర్డు పెద్దలకు సర్కాజి సయ్యద్ ఫక్రుద్దీన్ ధన్యవాదాలు తెలిపారు.

పింఛన్ల పంపిణీలో కుప్పం టాప్: కమిషనర్



ప్రజాశక్తి-, కుప్పం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో చిత్తూరు జిల్లాలో కుప్పం మున్సిపాల్టీ అగ్ర స్థానంలో నిలిచిం దని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 5,362 పెన్షన్లకు మొదటి రోజు 98 శాతం పెన్షన్లను పంపిణీ చేసి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు తెలిపారు. సకాలంలో పెన్షన్లు పంపిణీ చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు.

సాంబశివ ఆచారికి పలువురు నివాళి

ప్రజాశక్తి-కార్వేటినగరం : సాంబశివ ఆచారి మృతికి ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ సంతాపం తెలిపారు. పాత్రికేయ కుటుంబానికి రాజకీయ రంగానికి తీరని లోటన్నారు. ఆర్‌కెవిబిపేట గ్రామంలో జిడి నెల్లూరు నియోజ వర్గంలోని పాత్రికేయ బృందం పూలమాలలు లేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో పి ఎ సి ఎస్ చైర్మన్ ఎం జనార్దన్ రాజు, రాష్ట్ర పొల్యూషన్ డైరెక్టర్ నాగేశ్వర రాజు, మాజీ జడ్పిటిసి దేవికి లోక్నాథరెడ్డి చంద్రమౌళి రెడ్డి హేమంత్ రెడ్డి, పలువురు నివాళులర్పించారు.

రాజ్ టీవీ రిపోర్టర్ సాంబశివ ఆచారి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది. సాంబశివ ఆచారి మృతదేహానికి ఆదివారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనిషిని ప్రజలకు తీసుకెళ్లి ఒక మంచి వ్యక్తిని కోల్పోయామని పాత్రికేయులకు తీరని లోటు అని పేర్కొన్నారు.

పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ పిఆర్‌సీ, ఐఆర్‌ను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని పిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి గిరిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గిరింపేట ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు నాయకులు కనకరాజు, నరేంద్రరెడ్డి, వాణి, విజయభాస్కర్‌లు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే టీచర్ ఎల్జిబుల్ టెస్ట్ రద్దు చేస్తామని ప్రకటించారని అయితే ప్రస్తుతం ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ పరీక్షలు నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో డీఏలు ఇతర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్క రించాలన్నారు. రానున్న రోజుల్లో ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు.

అనుమానాస్పద స్థితిలో బైక్

వారం రోజులుగా పలమనేరు బస్టాండ్‌లోనే..

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఆర్టీసీ బస్టాండ్ లో వారం రోజులుగా ఓ బైక్ అనుమానాస్పద స్థితిలో వుంది. ఎపి 28 డికె1105 నెంబర్ కలిగిన ఈ బైకు ఫ్రంట్ వీల్ కు లాక్ చేసి వుంది. బండి మొత్తం బురద అంటుకుంది. బస్టాండ్ లోనే ఈ బైక్ ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు పట్టించుకోలేదు. మరి ఇది ఎవరిది? ఎందుకు నిలిపారు? అనేది తెలియాల్సి వుందని స్థానికులు వాపోతున్నారు.

మంచి మిత్రుడిని కోల్పోయాం..
టిడిపి సీనియర్ నాయకుడు నిధి ఆవేదన

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మంచి మిత్రుడిని కోల్పోయామని టిడిపి సీనియర్ నాయకుడు నిధి పేర్కొన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ రాజ్ టీవీ రిపోర్టర్ సాంబశివ ఆచారి (46), అతని స్నేహితుడు మహా టీవీ రిపోర్టర్ మోహన్ దాస్ కలిసి ద్విచక్ర వాహనంలో శనివారం రాత్రి సొంత గ్రామం కార్వేటినగరం మండలంలోని ఆర్‌కెవిబి పేటకు వస్తున్న సమయంలో బంద్రేవు గ్రామం మలుపు వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతిలోని నారాయ ణాద్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాంబశివ ఆచారి ఆదివారం మృతి చెందాడు. మోహన్ దాస్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. విషయం తెలుసుకున్న తెలుసుకున్న టిడిపి సీనియర్ నాయకుడు నిధి ఆర్‌కెవిబి పేటకు కార్యకర్తలతో కలిసి చేరుకున్నారు. సాంబశివ ఆచారి మృత దేహానికి ఎస్‌సి స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నా యుగంధర్ పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అతని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంచి మిత్రుని కోల్పోయామని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

జర్నలిస్ట్ కుటుంబాన్ని ఆదుకుంటాం: ఏపీడబ్ల్యూజేఎఫ్

-ఎస్ఆర్ పురం : ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, రాజ్ న్యూస్ రిపోర్టర్ సాంబశివ ఆచారి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ఏపీడబ్ల్యూజేఎఫ్ నేతలు హామీ ఇచ్చారు. ప్రమాదంలో మరణించిన సాంబశివాచారి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారికి తాత్కాలిక ఖర్చులుగా యూనియన్ 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించింది. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు కరకుంట్ల జయరాజ్ మాట్లాడుతూ సాంబశివాచారి జర్నలిస్టు సమస్యలపై రాజీలేని పోరాటం చేశారని, ఏపీడబ్ల్యూజేఎఫ్ బలోపేతానికి తీవ్ర కృషి చేశారన్నారు. ఆయన మృతి జర్నలిస్ట్ ఉద్యమానికి తీరని లోటు అన్నారు. నివాళులు అర్పించిన వారిలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి నీరజాక్షులు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు దేవరాజులు, నియోజకవర్గ సెక్రటరీ దేవరాజులు జిల్లా సహాయ కార్యదర్శిలు జయప్రకాష్, విజయ్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, బాలాజీ, సివిఆర్ పార్థ , నాగరాజు అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.



రాజ్ టివి రిపోర్టరు సాంబశివాచారికి నివాళులర్పిస్తున్న టిడిపి నాయకుడు నిధి, ఇన్‌సెట్‌లో మృతుడు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని ప్రజలు కంటి సమస్యతో బాధపడుతున్న వారికి తోడుగా మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో ప్రతి నెల మొదటి ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి పిఇఎస్ హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో బైరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరానికి కంటి సమస్యతో బాధపడుతున్న వారు 48 మంది హాజరు కాగా డాక్టర్లు పరిశీలించి ఆపరేషన్‌కు14 మంది ఎంపిక అయినట్లు గుర్తించి వారికి కంటి ఆపరేషన్ చేసేందుకు కుప్పం పిఇఎస్ హాస్పిటల్‌కు తరలించినట్లు సమా చారం అందిం చామని తెలిపా రు. ఈ కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు డాక్టర్లు శృతి, శ్రీనివాస్, మాహతి ఫౌండేషన్ బృందం మండల ప్రజలు పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలకు ఎంపికైన రోగులు

రోడ్డు మధ్యలో నిలిచిపోయిన రోడ్డు రోలర్
రాకపోకలకు అంతరాయం



ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల బస్టాండ్ కూడలి గాంధీ విగ్రహం వెనుక వైపు ఇరికిపెంట నుండి సదుం వైపు వెళ్లే రోడ్డులో రోడ్డు రోలర్ వైరింగ్ సాంకేతిక సమస్యతో రోడ్డు మధ్యలో ఆదివారం వేకువ జామున నాలుగు గంటల ప్రాంతంలో నిలిచిపోయింది. దీంతో సోమల నుండి పుంగనూరు వైపు వెళ్లే వాహన చోదకులు రోడ్డు రోలర్ అడ్డు కారణంగా ఆగి చూసి నెమ్మదిగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎట్టకేలకు మెకానిక్ మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో వచ్చి నాలుగు గంటల సమయంలో రోడ్డు రోలర్ ఎలక్ట్రికల్ సమస్యను పరిష్కరించి రోడ్డు రోలర్‌ను అక్కడ నుండి తమ గమ్యం వైపు తీసుకువెళ్లారు. దీంతో ప్రయాణికులు ఆనందించారు.

విలువలు లేని విద్య నిష్ప్రయోజనం

ప్రజాశక్తి- గంగవరం: లక్ష్యం విలువలు లేని విద్య నిష్ప్రయోజనమని పలువురు వక్తలు పేర్కొన్నారు. విశ్వ విద్యాలయం సాహితీ సమాఖ్య అధ్యక్షులు ఆచార్య గార్లపూడి దామోదర్ నాయుడు అన్నారు. ఆదివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని చదవడం ద్వారా విలువలు అలవడుతాయన్నారు. మరో ముఖ్య అతిథి శతావధాని ఆముదాల మురళి మాట్లాడుతూ పిల్లలు చెడిపోవడానికి తల్లిదండ్రులే ముఖ్య కారణం అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు నీతి కథలు చెప్పడం,నీతి పద్యాలు నేర్పించడం ద్వారా మంచి పౌరులుగా తయారవుతారన్నారు. ఈ దిశగా తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. 13 సంవత్సరాలుగా నిర్విరామ కృషి చేస్తున్న సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పి. తులసీనాథం నాయుడు, పుష్ప నిజమైన భాషా సేవకులు అన్నారు. వందకు పైగా పద్యాలు చెప్పిన 60 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. డాక్టర్ గుడివాడ అన్నయ్య నాయుడు(దామలచెరువు) జూటూరు తులసీదాస్ (అనంతపురం) మమ్ముల తిరుపతిరావు (విజయనగరం) నేమిలైటి కిట్టన్న (తిరుపతి) యువశ్రీ మురళి (బి. యస్. ఖండిగ)డాక్టర్ మౌని (తిరుపతి) టీఎల్.నరసింహులు, వి. నారాయణ (పలమనేరు) ఓట్ర ప్రకాశరావు (తిరుత్తణి) అశ్వర్థ నారాయణ (పుంగనూరు) పి. చిత్ర,నాగ బాలాజీ (గంగవరం) లకు వార్షికోత్సవ పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో పైనేని మురళి, సీతారామయ్య, లత, చాణుక్య,దామోదర్ నాయుడు,నరేంద్ర, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, చంద్రశేఖరయ్య,తులసి, పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో తులసీనాథంనాయుడు

కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణాభివృద్ధి
ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ హరిప్రసాద్

ప్రజాశక్తి -కుప్పం: కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణ అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం కుప్పం, గుడిపల్లి మండలాల పరిధిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కుప్పం మండలం వేపూరు మిట్టపల్లి, గుడిపల్లి మండలం గుండ్ల సాగరం, యామి గాని పల్లి, కనుమలపల్లి గ్రామాల్లో జనసేన జెండాను ఆయన ఆవిష్కరించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి శ్రేణులు కలిసికట్టుగా గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పయనంలో పరిగెడుతోందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సీఎం చంద్రబాబుకు భారీ మెజారిటీ రావాలంటే కూటమి పార్టీలు బలపడాలని, స్థానిక సంస్థల ఎన్ని కల్లో కూటమి గెలుపే లక్ష్యంగా అంద రూ కలిసికట్టుగా కృషి చేయా లని పిలుపు ని చ్చారు. ఈ కార్యక్ర మంలో కుప్పం జనసేన ఇన్‌ఛార్జి డాక్టర్ నరేష్, రెస్కో డైరెక్టర్ అమీర్, చంద్రశేఖర్, పాండు, చంద్ర, కృష్ణ, వీర మహిళలు నవనీత, వరలక్ష్మీ, దివ్య,కస్తూరీ, సరసమ్మ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమార్కులు సాధించిన విద్యార్థులకు, గాండ్ల కులంలో పుట్టి వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు, వృత్తిదార్లను అఖిల గాండ్ల తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గాండ్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హరికృష్ణ జిల్లా అధ్యక్షులు కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గిరిశ్రీనివాస్, రాష్ట్ర గౌవాధ్యక్షులు రెడ్డిరమేష్‌లు ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థినీ, విద్యార్థులకు, ఉద్యోగులు 100 మందిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి హేమవతి, లక్ష్మీపతి లతో పాటు పలువురు గాండ్ల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

మద్యం షాపుల వద్ద రచ్చ రచ్చ
కూలింగ్ లేదని బాటిల్ విసిరేసిన మందుబాబు

ప్రజాశక్తి-విజయపురం: స్థానిక మండలంలోని మద్యం షాపుల వద్ద తరచూ ఘర్షణ చోటుచేసుకుంటున్నాయని మందు బాబులు ఆరోపిస్తున్నారు. మండలంలోని గాండ్లకండ్రిగ మద్యం షాపు వద్ద బీరు బాటిల్‌కు కూలింగ్ లేదని, ధరపై స్టిక్కర్ పెట్టారని, అధిక ధరలకు అమ్ముతున్నారని శనివారం బీరు సీసా పగలగొట్టి విసిరివేయడంతో గాయాలైన సంఘటన వెలుగుచూసింది. మండలంలోని గాండ్లకండ్రిగ మద్యం షాపు వద్ద తమిళనాడుకు చెందిన ఇద్దరు వ్యక్తులు రాజేష్, వెంకటేశం మద్యం కొనుగోలు చేస్తుండగా బీరు బాటిల్‌కు కూలింగ్ లేదని వారు బాటిల్‌ను బయట నుంచి మద్యం అమ్ముతున్న వ్యక్తిపైకి విసిరారు. అది వైన్ షాప్ ముందున్న గ్రిల్‌కు తగిలి పగిలి వైన్ షాప్ లోపల దూసుకుపోయింది. దీంతో మద్యం విక్రయిస్తున్న వ్యక్తికి గాయా లయ్యాయి. ఈ విషయమై ఎస్ఐ మహేష్ బాబు కేసును విచారణ చేస్తున్నారు. మండలంలో పన్నూరు సబ్‌స్టేషన్, ఒకటి గాండ్లకండ్రిగ, ఒకటి కనకమ్మసత్రంలో రెండు మొత్తం నాలుగు మద్యం షాపులు ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించడం లేదని తరచూ గొడవలు జరుగుతున్నాయని, కనకమ్మ సత్రంలో ఉండేవారు రాత్రి పగలు మద్యం బ్లాక్‌లో అమ్ముతున్నారని వారు పేర్కొన్నారు. ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకోవాలని మందు బాబులు కోరుతున్నారు.

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని చల్లావారిపల్లి గ్రామ సమీపంలోని మునీశ్వరస్వామి కొండలో యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. మృతురాలు తండ్రి చంగల్రాయప్ప కథనం మేరకు తన కుమార్తె లావణ్య పలమనేరు మధు కాలేజీలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతోంది అని, లావణ్య మరణానికి మండలంలోని మారపల్లి గ్రామానికి చెందిన ఎంబీఏ విద్యార్థి కారణమని మృతురాలు తండ్రి ఆరోపించారు. మృతురాలు తండ్రి చెంగల్రాయప్ప ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మారప్ప తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని నేలపల్లి గ్రామ సమీపంలోని వ్యవ సాయ పొలాల్లో ఆదివారం ఉదయం విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు గ్రామానికి చెందిన నారాయ ణప్ప కుమారుడు సి.హరిబాబు (36) ఉదయం పొలం దగ్గర వెళ్లి స్టార్టర్ స్విచ్ బోర్డ్ ముట్టుకోగా కరెంటు షాక్ తో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.పక్కనే వ్యవసాయ పనుల్లో ఉన్న రైతులు చూసి కుటుంబీకులు సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులకు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందగా వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌పోమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇతనికి భార్య హరిత, హేమంత్ కళ్యాణి పిల్లలు, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై మారెప్ప కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



మృతి చెందిన సిహరిబాబు

చేపల వేట కోసం వెళ్లి వృద్ధుడి మృతి



ప్రజాశక్తి-చౌడేపల్లి: చేపల వేట కోసం వెళ్లిన వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చౌడేపల్లిలో చోటుచేసుకుంది. మండలంలోని పంచాయతీ కేంద్రం 29ఏ చింతమాకులపల్లికి చెందిన మునస్వామి (65) వ్యవసాయ కూలీగా జీవిస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు నిండుగా ఉండటం, చేపలు ఉండడం వల్ల శనివారం రాత్రి చేపల వేట కోసం గ్రామానికి సమీపంలోని మన చెరువుకు వెళ్ళాడు అయితే ఆదివారం ఉదయం అదే చెరువులో మృతదేహమై తేలాడు చేపలు పట్టేందుకు వలవేసిన మునుస్వామి వాళ్లకే తగులుకొని మృతి చెందిన విషయాన్ని గుర్తించిన స్థానికులు మృతుడి కుటుంబ సభ్యులకు వివరాలు తెలియజేశారు అనంతరం కుటుంబ సభ్యులు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

చెరువులో పడి వృద్ధురాలు మృతి



ప్రజాశక్తి-చౌడేపల్లి: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన చౌడేపల్లి మండలంలో ఆదివారం చోటు చేసుకుంది మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్దకొండామర్రి కి చెందిన లక్ష్మమ్మ (75) గ్రామంలోనే ఇంటింట యాచకం చేసుకుంటూ పొట్ట గడుపుకుంటూ ఉండేది. అనాథగా ఉన్న ఆమె దాహార్తిని తీర్చుకునేందుకు గ్రామానికి సమీపంలోని ఎగువకుంటలోకి వెళ్లింది. అక్కడ నీరు తాగుతూ ప్రమాదవశాత్తు కుంటలోనే పడి మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : మండలంలోని పాతపేట గ్రామంలో శ్రీనివాసులు వారి పెద్దయ్య పిన్నయ్య కుటుంబ సభ్యులతో కొంతకాలంగా భూ తగాదాలు, కుటుంబ తగాదాలతో మనస్థాపం చెంది ఆదివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేసుకున్నాడు తెలుసుకున్న స్థానికులు హుటా హుటిన బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు తరలించగా అక్కడ డాక్టర్ శాలిని చికిత్స చేసి అతని పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీనివాసులను. వాహనం ద్వారా మెరుగైన చికిత్స కోసం పలమనేరు ఏరియా హాస్పిటల్ కి తరలించినట్లు సమాచారం అందించారు ట్రైనింగ్ ఎస్సై జయ శ్రీ హాస్పిటల్ కి చేరుకొని పురుగుల మందు తాగిన శ్రీనివాసులు భార్య ద్వారా సమాచారం తెలుసుకుంటున్న వీరి కుటుంబ సభ్యులు కుటుంబ కలహాలతో ఈనెల ఒకటో తేదీఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న
కె చంద్రబాబుపై పీడీ యాక్ట్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో పలుమార్లు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న పంజాణి మండలం తాయారమ్మ కాలనీకి చెందిన కె.చంద్రబాబుపై పీడి యాక్టు నమోదు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కె. చంద్రబాబుపై జిల్లాలో అనేక కేసులున్నట్లు పేర్కొన్నారు. చంద్రబాబు పలమనేరు పట్టణ పోలీస్‌స్టేషన్, పంజాణి పోలీస్ స్టేషన్ పరిధిలో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పలుమార్లు నేరపూరిత కార్యకలాపాలలో పాల్గొనడం, ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా యువతను మోసం చేయడం, పంజాణి, గంగవరం, పలమనేరు, పుంగనూరు, పీలేరు, తిరుపతి, బెంగుళూరు, ఇతర పట్టణాలలో యువతను ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఊబిలోకి దించి వారి వద్ద నుండి కోట్ల రూపాయలను కాజేసి, అక్రమాలకు పాల్పడారని, బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకున్నవారు, అప్పులు బాధలు తట్టుకోలేక అనేక మంది ఆత్మహత్యకు పాల్పడ్డారని, వారిలో కొంత మంది చనిపోయారని తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎస్పీ తుషార్ డూడి, పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్ ఆదేశాల మేరకు, నిందితుడు కే.చంద్రబాబును కడప సెంట్రల్ జైలుకు ఆదివారం తరలించారు.